# త్రిపురనేని రామస్వామి చౌదరి తో



చౌదరిగారు హోటల్లో టిఫెన్ చేసి కాఫీ తాగి సిగరెట్టు పీలుస్తూ రాసుకో' అంటారు పొప్రయిటరు చిరునవ్వు నవ్వి రాసుకున్నాలే అంటాడు తృప్తిగా. నెలాఖరుకు ఒక్కసారిగా పైకం యిచ్చేవారు. చౌదరిగారూ, హోటలాయనా చిన్నప్పటి స్నేహితులు ఏవో గొడవలొచ్చి యిద్దరూ మాట్లాడుకోరు కాని చౌదరిగారు రాకపోతే పిచ్చెత్తినట్లు వుంటుంది హోటలాయనకు అదీ వారి స్నేహం.

**త్రిపుర:** శంకరుని యంత వేదాంత శాస్త్రవేత్త
అనియోగా 'అహమ్ బ్రహ్మోస్మి' యనుచుఁగాన
నాకు నేనె నమస్సులొనర్చుకొందు
ఆది మధ్యాంత శూన్యుడనైతి ననుచు

**మధుర:** భేష్ భేష్ మీకు మీరే నమస్కారం పెట్టుకున్నారు గనుక 'నమస్కారమండీ చౌదరిగారూ' అనవలసిన ప్రమాదం తప్పింది (నవ్వు) నమోన్నమః

**చెళ్ళపిళ్ళ:** బందరు నందు నాకు గల పల్వురు శిష్యులు స్కూలు శిష్యులై
నం దగు శ్రద్ధతో నితడ నారత మింటికిఁగూడ వచ్చి అం
దందలి మర్మమున్ దెలియు నాస్థగలాఁడగుటన్ వరించె వీ
నిం దగురీతిమైఁద్రిపుర నేనిని సాహితికైత తోడుతున్

**మధుర:** మీ ప్రియశిష్యుడ్ని నాకు పరిచయం చెయ్యడం కోసం తమరు స్వయంగా రావాలా? కబురంపితే నేనే వచ్చి తమ పాదాలచెంత వాలేదాన్నే

**చెళ్ళపిళ్ళ:** ఈతడొకండె కాదు కవి యీతని సోదరులెల్లగైతలో
జాతురినొల్చు వారగుట జన్మపువంశపు హక్కుగాని యీ
కైత బలాత్కృతిన్ గొనిన కాంత యనం బని లేదు శిష్యతా
భూతియుగాదు కమ్మఁదనపుం బసఁబట్టి గ్రహింపుడీ కవుల్

మా రామస్వామి అదొకరకం. నిన్ను సరిగా గుర్తించి మర్యాద చేస్తాడో లేదో అని-

**మధుర:** కిం కవీంద్ర ఘటా పంచాననులకు సాష్టాంగ దండప్రణామాలు. మిమ్మల్ని స్వయంగా వేరే మరొక్కమారు దర్శించుకుంటాను ఉద్ధతుల మధ్య నిరుపేద కుండతరమె. సెలవిప్పిస్తారా? ఇద్దరితో వేగలేను.

**చెళ్ళపిళ్ళ:** తథాస్తు (అంతర్థానం)

**త్రిపుర:** (చౌదరి పుస్తకం చదువుకుంటూ ఆమెవంక చూసి పలకరించడు.)

**మధుర:** గురజాడ అప్పారావుగారి మధురవాణిని. తమ దర్శనార్థం వచ్చాను.

**త్రిపుర:** (సిగరెట్ వేళ్ళమధ్య పెట్టి బాగా ఎగపీలుస్తూ) గ్రామ్య భాషలో రాశాడు కన్యాశుల్కం. అందులో బ్రాహ్మణ్యాన్ని ఏకి పారేశాడు (నవ్వు). అయితే నాకు మాత్రం వేశ్యలంటే పడదు.

**మధుర:** నా వృత్తితో మీకేం పని? మీ భావాలు ఆధునికం, సవ్యం. మీ భాష గొడ్డు గ్రాంథికం. అటువంటి భాషలో వెలిగించారే కవిత్వం?

**త్రిపుర:** నాది పండితుల భాష నేను పండితుడ్ని, కవిరాజుని.

**మధుర:** మీ సందేశం మీతో సమానులైన వారిలోకి వెళ్ళింది గాని, సామాన్య ప్రజలలోకి వెళ్ళలేదేమో ఆలోచించారా?

**త్రిపుర:** నింద్యగ్రామ్యం రాస్తే నన్ను కవిరాజనేవారా?

**మధుర:** విశ్వనాథవారూ మీరూ ఒకే పంథాలో వున్నారు తిక్కకూడా ఒక్కటే

**త్రిపుర:** నా కతనితో సాపత్యమేమి? నా తిక్క నాది

**మధుర:** తమ భావాలకు అనువుగాని భాషలో రాశారు పండితులిద్దరూ ముఖ్యంగా గ్రాంథికం మూల పడుతున్న దశలో మీరు, హేతువాద సూర్యులు అందులోకి వెళ్ళి యిరుక్కుపోయారు (నవ్వు)

**త్రిపుర:** గ్రామ్యభాషలో రాయనందుకు నన్ను తప్పుబడుతున్నావా?
తెలుగు బిడ్డా మరచిపోకుర
తెలుగు దేశము పురిటి గడ్డర
కొక్కొరోకో పాట పాడర
తెలుగు వారల మేలుకొలపర - యిందులో యిబ్బంది ఎక్కడుంది నీకు?

**మధుర:** స్వామీ! మీ కాలానికి మీరు చాలాముందు వుండి భావాలు వెదజల్లారు అదీ మరుగున పడిపోతున్న గ్రాంథికంలో మీరు రాసిన మరో పద్యం నాకు చాలా యిష్టం

వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడొ తెల్పుడీ
పూసిపోదుము మెడను వైతుము పూలదండలు భక్తితో
చాలా గొప్పగేయం, (నవ్వు)

**త్రిపుర:** నవ్వుతావు దేనికి?

**మధుర:** మీ గీతం గిరీశం గారికి చూపిస్తేనూ ఇందులో రామప్పంతులు లాజిక్కు వుందన్నాడు. అది గుర్తుకొచ్చి నవ్వాను.

**త్రిపుర:** ఏవిటా 'రామప్పంతులు లాజిక్కు'?

**మధుర:** వీరగంధంలో గూడా కులాల పిచ్చి వుందా?

**త్రిపుర:** వీరులు కులాతీతులు

**మధుర:** మీరు పైకులాలు పెత్తనం చెలాయించాయని మూమెంటు లేపారు. మీరు కూడా మీకింది కులాల పై పెత్తనం చెయ్యటం లేదా?

**త్రిపుర:** వాళ్లు ఎదురు తిరిగే రోజులూ దగ్గరలోనే వుండవచ్చు

**మధుర:** యీ కులపిచ్చి కుదిరేదేనా? దీనికంతం లేదా?

**త్రిపుర:** బహుశా యిది రాజకీయాల్లో జొరపడి అల్లకల్లోలం సృష్టించవచ్చు. అంటే యింతవరకూ పీరగంధం ఎవరికీ పూయలేదంటావు?

**మధుర:** స్వామీ! నే ననలేదు. ఆపాట అలా వుంది.

**త్రిపుర:** భలే దెబ్బ కొట్టావే! (నవ్వు).

**మధుర:** లేదు మీరే గెలిచారు మీరువచ్చి హేతువాద ఖడ్గం ఝుళిపించే దాకా భూసురుల అగ్రవర్ణపు అధికారాన్ని అడ్డుకొన్న నాథుడేడీ? కరటకశాస్త్రి తన సొంత పనులకు డిప్టీ కల్క్టరుగారి దగ్గరకు పంపితే చచ్చినట్లు వెళ్ళాను కానా? గిరీశం నన్ను డిప్టీ కల్క్టరు గారి పుత్రరత్నంగారి దగ్గరికి వెళ్లమన్నా వెళ్లాను అలాంటి మాకందరికీ ప్రశ్నించడం నేర్పింది మీరే!

**త్రిపుర:**

లోకులు దిట్టిన నిజమే
వాకొనగా గట్టిపట్టు బట్టినవాడన్
లోకుల యిష్టానిష్టము
లా! కవిలోకంబు కలము నాకట్టంగన్.

**మధుర:** మీ అహంకారం గురించి మీరు బాగా చెప్పుకున్నారు అజ్ఞానమన్నా వుండాలి, అహంకారమన్నా వుండాలి కొందరు కొన్ని పుస్తకాలు రాయడానికి

**త్రిపుర:**

అతిశయ భక్తిన్ వినుమా
ప్రతిభాషింపకయె తెల్గుబాస కుమారా!
అతి మధురం బతిపేశల
మతి పేయముకాదె బాసలన్నిటిలోనన్.

**మధుర:** మీకు సంస్కృతం అంటే ఏవన్నా చిరాకా?

**త్రిపుర:** నో!

ఒక్కభాష ప్రియమ్ము నొండొక్కభాష
విప్రియమ్ము నాకనుమాట వెగటు మాట
అయిన నే సొక్కుచుండెద నాంధ్రభాష
అతి మనోహర మగుటచే నాలకించి

**మధుర:** మీ కవిత్వం (అంటే పద్యాలు) సాటి అబ్రాహ్మణ కవులు మెచ్చుకున్న దానికంటె ఏవెంకట శాస్త్రిగారో, విశ్వనాథవారో అట్లాంటి ఇంకొకరో మెచ్చుకుంటే ఎక్కువ సంతోషించేవారట కదా!

**త్రిపుర:** ఎవరు చెప్పారిటువంటివన్నీ నీకు?.

**మధుర:** చీకటి గదులు అనే నవలలో సాక్షాత్తు మీ పుత్రరత్నం గోపీచంద్ వ్రాసాడు

**త్రిపుర:** మనకంటే తక్కువవాళ్ళు మెచ్చుకుంటే మనకేమానందం? మన ప్రత్యర్థులు గాని, శత్రువులుగాని మన్ని మెచ్చుకోవాలి.

**మధుర:** బాగున్నాయ్ గొంతెమ్మకోరికలు. మీరందరినీ తిట్టొచ్చు కాని, మిమ్మల్ని మాత్రం వాళ్ళు మెచ్చుకుని మేకతోలు కప్పాలి (నవ్వు)

**త్రిపుర:** అలా అన్లేదు నేను ఎక్కడ నాకు అర్హతవుందో అక్కడ నన్ను గుర్తిస్తే సంతోషిస్తాను నేను.

**మధుర:** మీ పురాణవైరం నిర్హేతుకం, సిల్లీ అంటున్నాను ద్రావిడులు, ఆర్యులు అంటూ బ్రాహ్మలు లేవదీసిన తగూలు వట్టి కల్పనలట. రాక్షసులు ద్రావిడులు కారు పొమ్మంటున్నారు కొత్త చరిత్రకారులు

**త్రిపుర:** నీ పాండిత్యం ఎవరిక్కావాలి? నా పురాణవైరం గురించి చెబుతాను విను-

బూతు పురాణము గాదిది
పాత పురాణమును గాదు పాతకహరమౌ
సూతపురాణం బియ్యది
పూత పురాణంబు పుణ్య పురుషావళికిన్

రాముడు ఆర్యుడు రావణుడు ద్రావిడ బ్రాహ్మణుడు శూర్పణఖ రాక్షసి అంటే ద్రావిడ స్త్రీ ఇదంతా కాదంటే ఎలాగ?

**మధుర:** రాముడు ధర్మప్రభువు శూర్పణఖకు ముక్కూ, చెవులు కత్తిరించారంటే అటువంటి నేరాలకు అలాటి శిక్షలుండేవి ఆకాలంలో. మీరు ఇంగ్లండు వెళ్ళొచ్చి ఆ దృష్టితో మాట్లాడ్డం తప్పుకాదా? మీకు వెనక దృష్టి లేదు.

**త్రిపుర:** నేనెవర్నో తెలుసా? రాముడికి స్వామిని అంటే రాముడికి మొగుణ్ని ఏమను కుంటున్నావో?

**మధుర** : 'స్వామి' అనేది గౌరవ విశేషణమే తప్ప అక్కడ షష్ఠీ తత్పురుష లేదు. అనగా తత్-ఆ యొక్క-రామునికి (పైన) స్వామి అనదగువారు లేరు

**త్రిపుర:** అది కాకున్నచో, 'రామస్వామి' యనునదా ప్రజా 'స్వామిక'ము!

**మధుర:** ప్రజాస్వామిక సూత్రాలు ఆనాడు లేవు స్వామీ మనుషులంతా సమానం అని ఎవరున్నారు? చాతుర్వర్ణ్యాలూ ఒకటి కాదు శూద్రుడు తపస్సు చేయడం తప్పని మరణదండన విధించారంటే - శూద్రుడు చెయ్యవలసిన విధ్యుక్త ధర్మం ఎవరు చేస్తారు? అనే కదా?

**త్రిపుర:** అయితే శ్రీరాముడు శంబూకుడ్ని వధించటం రైటంటావు?

**మధుర:** రైటూ, రాంగూ అంటూ మాట్లాడుతున్నారు మీరు ఇంగ్లండులో చదివివచ్చి. రామాయణ కాలం త్రేతాయుగం. అంటే కొన్ని లక్షల సంవత్సరాల క్రితం లేదా వందల, వేల సంవత్సరాల క్రితం రాజనీతి, పరిపాలనాక్రమం అలా వున్నాయన్నమాట.

**త్రిపుర:** చెట్టు చాటునుంచి వాలిని చంపడం సబబేనంటావు. అలా అలా 'సీతకు అగ్నిపరీక్షారైటే. ఆవిడ్ని అనుమానించి అడవికి తోలెయ్యడం రైటే. శంబుకుడ్ని చంపడమూ రైటే' - అంటావు గావును. అయితే యిక నీతో వాదించడానికి ఏముంది?

**మధుర:** చౌదరిగారూ అలా హీటెక్కిపోగూడదు. ఆనాటి పరిస్థితులు, దండనీతి, న్యాయం అలావుండేవి. దట్ వజ్ ద ఆర్డర్ ఆఫ ద డే అంతే. కాని మీరనుకున్నట్లు ఆల్ మెన్ ఆర్ ఈక్వల్ అన్నట్లు వుండేవి కావు. రాముడ్ని రాజుగా చూడకుండా మీరు కూడా దేవుళ్ళా చూసి కంగుతిన్నారు. అది వక్రంగా వున్నా అన్యాయంగా కనిపించినా అది అంతే.

**త్రిపుర:** నువ్వు నన్ను కన్‌ఫ్యూజ్ చేస్తున్నావు.

**మధుర:** అంత దేశాభిమానం, దేశభక్తి వున్నవారు. మీరు జస్టిస్ పార్టీలోకి ఎందుకు దూకారు.

**త్రిపుర:** ఈ బ్రాహ్మల డామినేషన్‌ను ఎదుర్కొనడం, వాళ్ళ హ్యూమిలియేషన్‌ను ప్రతిఘటిం చడం ప్రధాన సమస్య అయింది అప్పట్లో.

**మధుర:** బ్రాహ్మల డామినేషన్ సంగతి నిజమే కాని తెల్లవాళ్లు ఆ బ్రాహ్మణ భూతాన్ని చూపించి జస్టిస్ పార్టీలోకి మీ బోట్లని చేరదీసి, స్వాతంత్రోద్యమాన్ని నీళ్ళుకార్పించాలని చూశారు అన్ని జాతులూ కలవకుండా విభజించి పాలించు అన్న ఆంగ్లేయ నీతికి మీరు లొంగి పోయారు. అవునా?

**త్రిపుర:** అది మా ఆత్మగౌరవానికి సంబంధించిన ఉద్యమం కనుక జస్టిస్ పార్టీలో చేరా. జస్టిస్ పార్టీవాళ్లు మాంట్‌ఫర్డ్ సంస్కరణల విధానాన్ని సమర్థిస్తే నేను వాళ్ళతో కలవలేదు; పైగా వ్యతిరేకించా. జాతీయవాదుల డిమాండ్లను అంటే అధికారం జాతీయ వాదులకి రావాలనేవాదాన్ని సమర్థించా.

**మధుర:** అబ్రాహ్మణ జాతీయవాదుల సమావేశానికి విజయవాడలో 1917-18లలో అధ్యక్షత వహించారట గదా? అంటే బ్రాహ్మణులతో కలసి స్వాతంత్ర్యం పంచుకోవడానికి యిష్టం లేదన్నమాటా?

**త్రిపుర :** అప్పటి వ్యవహారాలని యిప్పుడు యీ దృక్పథంతో చూస్తేఅవకతవకగా కనిపించవచ్చు. నువ్విందాక ఆర్డరాఫ్ దడే అన్నట్టు. అప్పట్లో బ్రాహ్మణేతరోద్యమం అనేది ఓటి ప్రబలంగా వుంది. దాన్ని ఒప్పుకోవాలి. దాన్ని నేను సపోర్టు చేశాను; ఆత్మగౌరవానికి సంబంధించిన ఉద్యమం గనుక. తరవాత జాతీయోద్యమం వచ్చింది. దాంట్లో కూడా స్వపరిపాలనకోసం జస్టిస్ పార్టీని వ్యతిరేకించా. ఇదీ ఆనాటి పరిస్థితి.

**మధుర:** మీలో కొందరు - మీరు కాదనుకొండి - స్వాతంత్ర్యం వస్తే మళ్ళీ పరిపాలన బ్రాహ్మణా ధిక్యతలోకి పోతుంది; బ్రాహ్మణులక్రింద పనిచేయడంకంటే బ్రిటిష్‌వాళ్ళ క్రిందే పనిచేయడం మంచిది అని స్వాతంత్రోద్యమాన్నే చులకనగా చూశారుగా!

**త్రిపుర:** లేదు. ఆరోజుల్లోనే మేం స్వకుల పౌరోహిత్యం ఆరంభించాం జంధ్యాలు వేసుకుని సంధ్యావందనం చేశాం బ్రాహ్మలకన్నా నిష్ఠగా మేమూ వున్నాం నేను పెద్దరికం వహించి ఎన్నో పెళ్ళిళ్ళు చేయించాను.

**మధుర:** అయ్యో! పిచ్చి చౌదరిగారూ, బ్రాహ్మణత్వాన్ని వద్దంటూ బ్రాహ్మణ ఆచారాల్నీ, పద్ధతుల్నీ మీరు అనుసరించడం వలన బ్రాహ్మణుల గొప్పదనాన్ని మీరు ఒప్పుకున్నట్లు కాలేదా?

**త్రిపుర:** అలా చూడకూడదు సాంస్కృతికంగాను, విద్యపరంగాను, నియమ నిష్ఠల్లోను ఎవరికీ తీసిపోము అని రుజువు చేశాము నీవన్నట్లు వెక్కిరించాలనుకుంటే వెక్కిరించవచ్చు. నా విరోధం బ్రాహ్మణత్వంతోనే కాని బ్రాహ్మణులతో కాదు

**మధుర:** ఇది తప్పించుకునేవాళ్ళు చెప్పేమాట బ్రాహ్మడు లేకుండా బ్రాహ్మణత్వం అని వేరే వుంటుందా? (నవ్వు)

**త్రిపుర:** అందుకే తరువాత నాస్తికుడ్నయ్యాను

**మధుర:** ఇహ మీరు నాస్తికులయితే మీ పోరాటం అంతా పోయినట్లే - దేవుడ్ని అంగీకరించిన వారికి పురాణాలతో ఏం పని? పైగా ప్రపంచమంతటా వున్న పురాణ సంస్కృతిని మీరు బ్రాహ్మణాధిక్యత నెపంతో ఎలా తిరస్కరించగలరు?

**త్రిపుర:** మన పురాణాలన్నీ బ్రాహ్మణాధిక్యతతో రాసిన పుక్కిటి గాథలంటున్నాను

**మధుర:** మీరు ఏవన్నా మీ సంస్కారం వ్యక్తిత్వం యీ శతాబ్దానిది పురాణ కాలాన్ని కొలవడానికి మంచి చెడ్డలు నిర్ణయించడానికి అది బొత్తిగా పనికిరాదు వేల వందల సంవత్సరాల క్రితం చరిత్రను మీరెలా నిర్దేశిస్తారు? మీదంతా డబాయింపు సెక్షను లేకపోతే తిట్టడం దేనికిట? శేషం కోపేన పూరయేత్

**త్రిపుర:** అన్యాయంగా మాట్లాడుతున్నావు నా వ్యక్తిగత కక్షతో నేనిదంతా తిరిగి వ్రాయలేదు. ఇది యిలాకూడా జరిగి వుండవచ్చునన్న అభిప్రాయంతో నమ్మకంతోనే వ్రాశా మొండిగా నమ్మా

**మధుర:** సెటైర్‌గా మీరేం చెప్పినా పవర్‌ఫుల్ గా వుంటుంది కాని మీరు చెప్పిందంతా మీరూ నమ్మేసరికి చౌదరిగారింత అమాయకులా అని జాలి వేస్తుంది స్వామీ

**త్రిపుర:** మలమల మాడు పొట్ట తెగ మాసిన బట్ట కలంత వెట్టగా
విలవిల యేడ్చుచున్న నిరుపేదకు జాలిని జూపకుండను
త్తలిపడి పోయి జీవరహితం బగు బొమ్మకు నిండ్లు వాకిళుల్
పొలమును బొట్టనిచ్చెడి ప్రబుద్ధ వదాన్యులు నిచ్చుమెచ్చెదన్ -

త్రిపురనేని రామస్వామి చౌదరి

అనిన్నీ ''ఏడో, పధ్నాలుగో, మూడో, ఎన్నో జగముల సృష్టించు యీశుడొకడో, యిర్వురో'' మరెంత మందో వారిని కనుగొనలేక, ''భక్తకోటికి ప్రాణాలపైకి'' వచ్చినదనియు, ''ఇందుగల డందులేడని సందేహము'' లేనివానికి, ''ఇందుగల డిందుగలడని తీర్థయాత్రలు చేయుట ''భాగవదపచారములు గావె పరమ పురుష'' అనియు ''గుడికి తరచుబోయి గొణుగుచుండెడి వాడు పెద్ద పాపమేదొ చేసియుండు'' ననీ నామతం!

**మధుర:** ఇస్లాములో మీవంటి హేతువాద సూర్యుడు ఉదయిస్తే యిట్టే ఆర్పేసేవారు హాయ్ అల్లాఅంటూ.

**త్రిపుర:** అందుకే వాళ్ళింకా అట్లా వున్నారు వెనకబడి

**మధుర:** అబ్రాహ్మణ ఉద్యమాలు ఆత్మగౌరవం ఉద్యమాలు వీట్లన్నిటిలో పనిచేస్తూ కూడా మీరు ఒక్కకులం అభ్యున్నతి కోసమే పాటుపడ్డారని మీమీదో అపవాదు వుంది. దానికి మీరేమంటారు?

**త్రిపుర:** నాకులం మటుకు దేశంలో భాగం కాదా - అది అలానే మొదలయింది. ఎక్కడ పుండు వుందో అక్కడ కడిగి కట్టువేసి మ -ేస్తారు. మొదట్లో సంఘసంస్కరణ, విద్యాభివృద్ధి, ఆత్మగౌరవం యివన్నీ బ్రాహ్మణత్వ అహంకారానికి ప్రతిగా వచ్చినవే తప్పులేదంటాను. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ల ొంచి వచ్చినవే

**మధుర:** తప్పొ రైటా అని కాదు గురువుగారూ. అవి మీ ఇమేజిని క్రుంగదీశాయి మీరు జాతీయ నాయకులుగా జాతినంతా రిప్రజంటు చెయ్యలేదు. కులరహితంగా పోవాల్సింది అబ్రాహ్మణ ఉద్యమంలో కూరుకుపోయారు నిలువునా.

**త్రిపుర:** నువ్వు ఎన్నిమార్లు చెప్పినా ఒక్కటే సమాధానం అప్పటి పరిస్థితులు అలా లాగేశాయి నన్ను.

**మధుర:** జస్టిస్ పార్టీలోని మీవారు కాంగ్రెసులోని మీవారికోసం తాపత్రయం పడ్డారు

**త్రిపుర:** స్వకులాభ్యున్నతి ద్వారా సాంఘిక సంస్కరణ సాధించటం యిప్పుడు నింద్యమే; అప్పుడు తప్పుకాదు. నేను జాతీయోద్యమంలో నా ఉత్సాహాన్ని చంపుకోకుండా జస్టిస్ పార్టీలో మావాళ్ళకు ఆశీస్సులందచేసిన మాట నిజమే. రెండు పడవల మీద ప్రయాణం చెయ్యలేదు

**మధుర:** ఇన్నయ్యకి ఆచార్య రంగాగారు వ్రాసిన ఉత్తరంలో మీరు కులపిచ్చిలో కూరుకుపోలేదనీ, 'పీరగంధం తెచ్చినారము వీరులెవ్వరో తెల్పుడీ' అన్న పాట ఒక్కటి చాలు జాతీయ నాయకులలో మిమ్మల్ని ముందుసీటున నిలపడానికి అన్నారు తెలుసా?

**త్రిపుర:** ఏ రంగయ్యా నాకు యోగ్యతాపత్రం యివ్వక్కర్లేదు. నేను నేనే నామంచి చెడ్డలు అన్నీ నావే నా పురాణవైరం అంతా సనాతనాచారాల ఊబిలోంచి మనవాళ్ళను పైకిలాగడానికే. తెలిసే చేశాను.

**మధుర:** ఐరిష్ దేశభక్తుడు డీవెల్రా మీ ఫ్రెండట గదా!

**త్రిపుర:** అవును, రంగయ్య నాసాయం అడిగాడు. 'కమ్మపత్రిక'ను రైతు పత్రికగా మార్చాం ఎందుకంటే - కమ్మ వారితో పాటు రెడ్లు, తెలగాలు, రాజులు, కొందరు పంచములుకూడా రైతుల్లో వుండేవారు - రైతాంగం సమస్యలనూ ప్రభుత్వ పీడననూ బ్రిటిష్ సర్కారు దృష్టికి తేవడానికి ఈ పత్రిక ఉపయోగపడింది. దానికి నేనే ఎడిటర్ని.

**మధుర:** కమ్మవారిని యితర కులాలతో చేర్చి జాతీయ ముఖ్యస్రవంతిలో కలపడానికి చేసిన ప్రయత్నాల్ని మీవాళ్ళు అడ్డుకోలేదా?

**త్రిపుర:** అది సహజం. అడ్డుకుంటే నేనువారిని ఎదిరించి తెగేసి చెప్పాను: అందరం కలిశాక ముందునకు పోదాం అని. రైతుపత్రిక్కి రంగయ్య ఇంగ్లీషు లేబర్ గురించి, సామ్యవాద భావాలగురించి అక్కడి పరిస్థితుల గురించి; వ్రాసేవాడు రంగయ్యకి కమ్మవారితో పేచీలొస్తే నేను అడ్డుపడేవాడ్ని.

**మధుర:** సెంట్రలు గవర్నమెంటు వారు మా గురజాడ అప్పారావుగారికి పోస్టలు స్టాంపు వెయ్యలేదుకాని మీకు వేశారు. (నవ్వి) ఆ గౌరవం మీకు దక్కింది.

**త్రిపుర:** (ముసి ముసి నవ్వులు నవ్వుతాడు )

**మధుర:** మీ లక్షణాలన్నీ ప్రతి తెలుగువాడిలోనూ వున్నాయి మీరు నూటికి నూరుపాళ్ళు తెలుగుబిడ్డ అయినా మిమ్మల్ని ద్వేషించడం తేలిక, ప్రేమించడం కష్టం (నవ్వు).

* * *

(సూతాశ్రమంలో రామస్వామి చౌదరి గారు సిగరెట్ దర్జాగా పీలుస్తూ ఉంటారు)

**త్రిపుర:** పాయక పూర్వగాధలని ప్రత్నకవీంద్రులు నేఁటి దాక రా
మాయణ భారతాది కృతులన్నియు వ్రాసిరి త్రిప్పి త్రిప్పియే
దోయొక కబ్బ మంచుఁదలకొక్కటి యక్కట నూతనాంశమేదో
యొకటేనియుం దెలుపనోపని గ్రంథ సమూహమేటికో

**మధుర:** నూతనాంశాలని మీరనుకున్న వాటిని మీకు వదిలేశారేమో! (నవ్వు)

**త్రిపుర:** నేడు హైందవమున వేదములు వైదొలగినవి. ఉపనిషత్తులు తపతపలాడుచున్నవి. స్మృతులు శిరసుపైకి, పురాణములు బుజములపైకి, ఆచారములన్రు పైకి ఎక్కి హిందువుల నణగు ద్రొక్కుచున్నవి. ఈ పైశాచిక శాసనములో కులవైషమ్య మొకటి. ఇది కావ్యజగత్తులోకి కూడ ప్రాకినది కట కటా!

**మధుర:** వేశ్యలు సంస్కృతం చదువుకోవచ్చు నన్నారే - ఇంకెవరికీ పర్మిషను లేదు.

**త్రిపుర:** అప్పకవి శూద్రుల రచనలను గూర్చి - పాయసమైనను మృష్టాన్నమైనను సంస్కార పక్వముగానిచో హవ్యమునకు పనికి రాదన్నాడు.

**మధుర:** అందుకే పాపం చిన్నయ సూరిగారిని ''చిత్, నయ, సూరి'' అన్నారు. అంటే జ్ఞానమును దొంగిలించుటలో సమర్థుడు అని వేళాకోళం చేశారు పాపం, తరగతిలో

శూద్రులు కూర్చుంటే వారిని చూడకుండా వారివైపు వీపు తిప్పి పాఠం చెప్పే వారట పండితులు. గిడుగు రామ్మూర్తి పంతులు గారు తాపీ పాఠం చెప్పే వారట - వ్యావహారిక భాషను వ్యతిరేకిస్తున్నాడని

**త్రిపుర:** సూతుడు శౌనకాది మహామునులకు చెప్పినట్లు దేవావైశంపాయనుడు జనమే జయునికిట్లనియె అన్నారు భారతంలో కాని-

నా పేరన్ వెలయించి నా మెడకు నంటం గట్టి తద్గ్రంథముల్
నాపై నేరము మోపహా దలంచి యన్యాయంబు న్యాయంబుగా
బాపంబు న్సుకృతంబుగాగ రచియింపంజాలినారెవ్వరో
నాపై బెట్టిన యట్టి యాయుగడు మాన్పంగా బ్రయత్నించెదన్.

అని సూతుడు నాతో గోలపెడితే నేను సూతపురాణం, భగవద్గీత తిరిగి రాయాల్సి వచ్చింది, ద్రావిడులు ఆర్యుల పోరాటాలు దృష్టిలో వుంచుకుని.

**మధుర:** కౌరవులదే రాజ్యం పాండవులకు హక్కు లేదని వాదించారట గదా మీరు?

**త్రిపుర:** అందుకోసం కురుక్షేత్ర సంగ్రామం వ్రాశాను నాతో పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కూడా కలిశారు

**మధుర:** ఇదంతా మీ ఆంగ్లవిద్యా ప్రభావంవలన పురాణాలను గుడ్డిగా నమ్మక స్వతంత్రంగా చేసిన ఆలోచనల ఫలితం మీరు రాజ్యాధికారం కౌరవులదేనని వ్రాశారు కాని మూలంలో స్పష్టంగా ధృతరాష్ట్రుడు అంధుడగుట చేత రాజుకాలేదనీ, పాండురాజే రాజయ్యాడనీ వుంది కాని పాపం పాండురాజుకి వున్న జ్యేష్ఠభ్రాతృ గౌరవం చేత అతనికి పెద్దరికం యివ్వడం చేతనూ, తమ నిరంతరం దిగ్విజయాలతో రాజధాని లేకపోవడం చేతనూ, ధృతరాష్ట్రుడు స్థాన బలిమిచేత వచ్చిన అధికారాన్ని నిలుపుకొని, ధర్మరాజుకి పూర్తి రాజ్యం ఇవ్వాల్సి వుండగా, కొంత రాజ్యం మాత్రం యిచ్చి, దుర్యోధనుడికి ప్రధానమైన హస్తినాపురం సంక్రమించేట్లు ఏర్పాట్లుచేశాడు అంచేత కౌరవులదే అన్యాయం, పాండవులది కాదు స్వామీ!

**త్రిపుర:** పంచమ వేదానికి నేను పట్టించిన దుర్గతికి నన్ను మతద్రోహి అన్నారు ఆ రోజుల్లో తిరుపతి వేంకట కవుల పాండవ నాటకాలు వీర విహారం చేసేవి కౌరవులు అధర్మపరులని ధర్మరాజు ధర్మపక్షం అవలంబించి శ్రీ కృష్ణుని సాయంతో ధర్మప్రతిష్ఠాపన చేశాడనే విశ్వాసం ప్రగాఢంగా వుంది అప్పుడే నాకు భారత కథలోని అంతరతత్వం పై అనుమానాలు కలిగాయి హేతువాద దృక్పథంతో భారతం క్షుణ్ణంగా చదివా నా కురుక్షేత్ర సంగ్రామం రెండవ అంకంలో సంజయపాత్ర ముఖంగా కురుసామ్రాజ్యాధిపత్యం ధృతరాష్ట్రుని యందే కాని పాండురాజుకు లేదని హేతుబద్ధంగా చెప్పాను. మేము చేయని పని నీవు చేసినావు అని చెళ్ళపిళ్ళవారు కూడా అన్నారు మెచ్చుకుంటూ

**మధుర:** అయితే పాత పురాణాలను ఇతిహాసాలను మీరు తూర్పార పట్టడం సంఘ శ్రేయస్సు ఎలా అవుతుంది?

**త్రిపుర:** మానవ సంఘం బాగుపడాలంటే కాలాన్ని బట్టి క్రొత్త నిర్మాణాన్ని సాగిస్తూ వుండాలి. కాని అంతవరకూ సంఘంలో వున్న కట్టుబాట్లు దీన్ని సాగనివ్వవు. కాబట్టి వాటిని త్రెంచాలంటే కురుక్షేత్ర సంగ్రామంతో మొదలెట్టాలి.

**మధుర:** డి.యల్ రాయ్ నాటకాల్లో శంబుకవధ గురించిన నాటకం కూడా వుందిట గదా!

**త్రిపుర:** అయితే సామాన్యులకు తెలియదు.

**మధుర:** మీరే శంబుకులు. కాని శంబుక వధ శ్రీరామునిది. అప్పటి వ్యవస్థ అలా వుండేది. ఎందుకు వుండేది అని ప్రశ్నించడం వేరే విషయం నేరాలు ఎలాంటివైనా దండన నేటి పాకిస్తాన్‌లో వలె వుండేది?

**త్రిపుర:** ''రాజా రాష్ట్రకృతం పాపం రాజపాపం పురోహితః'' అన్నట్లు ఆ పాపం వసిష్ఠుడి మీద పడింది

**మధుర:** చౌదరిగారు రామాయణంలో ఆర్య ద్రావిడ సంఘర్షణను తెచ్చిపెట్టారు. రాక్షసులు ద్రావిడులనడానికి ఆధారాలేమిటి?

**త్రిపుర:** ఆర్యజాతి ద్రవిడ జాతిని ఓడించి అసురులనీ, దస్యులనీ పిలిచి, వారిని దుర్మార్గులుగా నిరూపించి, జయించి, బానిసలుగా జేసికొని శూద్రులుగా వ్యవహరించి వారికేహక్కులు లేకుండా చేశారు. పురాణాలు స్మృతులు యీ భిన్నజాతుల కొరకు ఏర్పరచిన శాసనాలే. కనుక యవి ప్రమాణాలు కావు. పాశ్చాత్య పండితులు ఆర్యులు పైనించి వచ్చారనీ ద్రావిడులు యిక్కడి వారేననీ నిర్ధారణ చేశారు.

**మధుర:** రాక్షసులు ద్రావిడులు అనడానికి ఆధారాలు లేవుట. అసలు ఆర్యులు ఎక్కడ నుంచి వచ్చారో యింకా తేలలేదు ద్రావిడులు కూడా యిక్కడి వారు కాదని కొందరంటే, ఆర్యులూ ద్రావిడులూ రెండు విభిన్న జాతులవారు కారనీ రెండు భాషలు మాట్లాడే ఒకే జాతి వారనీ కొందరంటున్నారు. కనుక జన్మతః దాక్షిణాత్యులైన ద్రావిడులను విదేశీయులైన ఆర్యులు ఆక్రమించారన్న కవిరాజు గారి ఊహ సరైనది కాదు. పైగా రాముడు మీకు అర్థం కానంత మాత్రాన రాక్షసులు అంతా మంచివాళ్ళు ఎట్లా అవుతారు?

**త్రిపుర:** నా శిల్పం అంతా ఆర్య ద్రావిడ సంఘర్షణ మీద పూర్తిగా ఆధారపడివుంది. అది రామాయణమైనా, శంబుక వధ అయినా మరోటీ అయినా-

**మధుర:** రామస్వామి నాయకర్ ప్రభావం మీమీదేమైనా వుందా?

**త్రిపుర:** రామాయణం నేనూహించినట్లు నేన్చెప్పినట్లే జరిగి వుంటుంది.

**మధుర:** ఆర్యుల సంస్కృతి విజ్ఞానం మనకు బాగా తెలుసు మీరు మంచివారంటున్న రాక్షసుల గురించి వారి మంచితనం గురించీ మనకేమీ తెలీదే? తాటకిని శూర్పణఖను మీరూ నార్లగారూ మెచ్చుకున్నార్!

**త్రిపుర:** మనవాళ్ళు పవిత్రంగా భావిస్తున్నవన్నీ ఎలా దోష భూయిష్ఠాలో చెప్పాను స్త్రీ

పురుషులు శాస్త్ర దాస్యం నుంచి, భావదాస్యం నుంచి విముక్తులైతే వారికి యింక నేనేమీ చెప్పక్కర్లేదు.

**మధుర:** ఏది ఏమైనా మొత్తానికి మీరు తెలుగువాళ్ళ మూతికి బిగించిన తాళాన్ని తీశారు. మిమ్మల్ని భావ విప్లవకారుడు అనకపోతే చాలా ప్రమాదం

**త్రిపుర:** ఏం ప్రమాదం?

**మధుర:** మీరు అదిగాకపోతే ఇంకేమిటి? ఏమీ కాకుండా ఎలాపోతారు?

**త్రిపుర:** పదహారణాల తెలుగు బిడ్డను.
కంచి కోటల కంచు తల్పులు
ఖంగు ఖంగున మ్రోగునప్పుడు
తంజనగరపు కోట గోడలు
చెంగు చెంగున ఎగురునప్పుడు
తిరువటంబునఁ జేరసేనలు
కెవ్వు కెవ్వున నరచునప్పుడు
మధురకోట యగడ్తలన్నియు
రివ్వు రివ్వున దూకునప్పుడు
తెలుగు వారలు పిరికి వారలా
తెలుగు బిడ్డా! తెలిసికొనుమా!

**మధుర** : 'మందే రా' ఒక మాటు పాడండి నా కోసం!

**త్రిపుర:** బ్రహ్మపురము మందేరా
కాదని వాదుకు వస్తే
పర్లాకిమిడి మందేరా
కటకం దాకా మన్దేరా!
బస్తరెల్ల మందేరా
కాదని వాదుకు వస్తే
జయపూరంతా మందేరా
నాగపూర్ దాకా మందేరా!
గోలుకొండ మందేరా
కాదని వాదుకు వస్తే
తెలంగాన మందేరా
నైజామంతా మందేరా!
చెన్నపురము మందేరా
కాదని వాదుకు వస్తే
చెంగల్ పట్టు మందేరా
తంజావూరును మందేరా!
బెంగుళూరు మందేరా
కాదని వాదుకు వస్తే
బళ్ళారీ మ్మందేరా
కన్నడ మర్థం మందేరా!
దేవికోట మందేరా
కాదని వాదుకు వస్తే
పుదుక్కోట మందేరా
కాండీ దాకా మందేరా!

**మధుర:** చబాష్! మీరు పది కాలాలపాటు చల్లగా వుండాలి మీ తెలుగు పౌరుషానికి తెలుగు అభిమానానికి హద్దులు లేవు. హిందీ అంటే పడదుగా - సంస్కృతం అంటే కూడా మీకు పడదా?

**త్రిపుర:** సంస్కృతము దేవభాషయని నిన్న మొన్నటి వరకు ద్విజులే చదువవలెననిరి.

మనలను దాస్యమునందుంచెడు భాష మనకెందులకు? మనము తెలుగు వారము. తెలుగు మనకు తల్లిభాష. తెనుగు తేట అని ప్రశంసించు వారు తెనుగునుడి కారముతో వ్రాయరేమి?

**మధుర:** మీరు వక్త కారు పద్యం బాగా చదవలేరుట. సోక్రటీసులాగ డైలాగ్స్ బాగా చెప్తారట. నిజమా?

**గిరీశం:** (ప్రవేశించి) నిండు మనమ్ము నవ్య నవనీత సమానము పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము గురువుగారు పెడసరంగా మాట్లాడినా వారి డైలాగ్స్ చమత్కారాలూ మిరియాలూ నేన్చెబుతాను విను.''మోడ్రన్ కవులంటే వారికి చిరాకు'' 'ధర్మం కృతయుగంలో నాలుగుపాదాలు నడిచింది' అన్నారెవరో 'ఆ కాలంలో అందరూ పశుప్రాయులన్న మాట' అని వెంటనే మాటకు మాట జవాబిచ్చారు గురూజీ. ఒకరు రామకోటి వ్రాసి వారిని మెప్పించుటకు వచ్చారు ''యిన్ని సంవత్సరాల నుండి వ్రాస్తున్నా రెండక్షరాలు సరిగా వ్రాయలేక పోయావు'' అన్నారు చటుక్కున అంగలకుదురులో ఒక ఉపన్యాస చక్రవర్తి కవిరాజు గారిని ''మీరు మ్లేచ్ఛులు గదా. నేను స్వచ్ఛమైన బ్రాహ్మణున్ని'' అన్నారట కవిరాజు ''మీరు మనుస్మృతిని అంగీకరిస్తారు గదా'' అని అడగ్గా ''తప్పకుండా'' అన్నాడట ఆ బ్రామిన్ ''వింధ్య అవతల ప్రదేశమంతా మ్లేచ్ఛ దేశమని మనుస్మృతి చెప్తున్నది'' అనగా అంతా గొల్లుమన్నార్ట సడెన్గా పర్వతనేని వీరయ్యచౌదరిగారు తమస్వగ్రామం అయిన పెదనందిపాడులో కవిరాజుగారితో షికారుకని వెళ్ళి అక్కడొక డొంకలో కూర్చున్నారు ఆ డొంకలు చాలా విశాలంగా వున్నాయి ఆ డొంకలను చూపిస్తూ ''ఇంత విశాలమైన డొంకలు ఎక్కడా లేవు'' అనగానే చౌదరిగారు తడుము కోకుండా ''అవును పనికి మాలిన భూములైనపుడు డొంకలు లేకేమవుతాయి సహారా ఎడారిని చూసి మెచ్చుకున్నట్లుంది నీమెచ్చికోలు'' అని వారిని కంగు తినిపించారుట మా గురువు

**మధుర:** చాలా సంఘటనలను గుర్తుచేసి నవ్వించారు గిరీశం గారూ-చౌదరిగారి జీవితానికి మూల సూత్రం ఏది?

**గిరీశం:** హేతువాదతత్వం సత్యాన్వేషణ వివేచనాశక్తిని మానవ వ్యవహారాలకు సమస్యకు అన్వయింప జేయటమే హేతువాదం అన్నాడు యం యన్ రాయ్ మరొక్క మాట- రామస్వామి గారు బాల్యంలో చేతబడి చేసిన చెట్లెక్కి పలుదోము పుల్లకోసికొని అక్కడి డబ్బుల్ని జేబులో వేసుకుని మంత్రించిన బెత్తాన్ని యింటికి తెచ్చేవారట అలాగే విదేశాల్లో 13వ నెంబరు గదిలో వుండే వారట

**మధుర:** హిందూస్థానీ కర్ణాటక సంగీతంలోని భేదాలు, సైగాల్ మ్యూజిక్కు, న్యూధియేటర్స్ సినిమాలు, హిందీ వ్యతిరేకోద్యమం యివన్నీ మీకిష్టమైనవే

> గుదురని జంకు చూపు గమి గూపులు గల్గియు నామనస్సులో
> మెదలుచు నుండెగా ప్రతి నిమేషము మత్కులకాంత నేటికిన్

**త్రిపుర:** పున్నమ్మ మహాసాధ్వి ప్రసవంలో గతించింది మహాభక్తురాలు; నిరంతరం పూజలు చేస్తూ వుండేది

**మధుర:** ఈమె గోపీచంద్గారి తల్లా?

**త్రిపుర:** అవును. అట్లూరి వారికి మా త్రిపురనేని వారికి చాలాకాలంగా బంధుత్వం వుంది. మా అత్తారివూరు అంగలూరికి దగ్గరగా వున్న చౌటపల్లె. ఆమెకు అయిదవ ఏడు. నాకు పదేళ్ళు. నేను 1914లో ఇంగ్లండు వెళ్ళేటప్పుడు వాళ్ళను అంగలూరులో దించి వెళ్ళా.

**మధుర:** బ్రాహ్మణులలో కొంతమంది మాంసాహారులవుతున్న యీ కాలంలో మీరు పూర్తి శాకాహారులు కావటం ఆశ్చర్యకరమే.

**త్రిపుర:** జీవహింస చేసి జీవింతుననుకంటెః
జెట్ట యెందుఁగూడఁబుట్టఁబోదు
జీవహింస మాని జీవింపరాదొకో .

**మధుర:** మీరు శాకాహారులు కావడం కంటె కూడా మరో గొప్ప సంగతి మీరు తెనాలి ఛైర్మన్‌గా వున్నపుడు మారెమ్మ తెనాలి మీద విరుచుకుపడినపుడు జాతర్లకి బలులకి మీరు ముక్తిచీటీ యివ్వలేదట గదా! విశ్వాస రాహిత్య తీర్మానం తెచ్చినా మీరు ఆదర్శభ్రష్టులు కాలేదు. మీరు వాక్శూరులు కాదు కార్యశూరులనిపించుకున్నారు. ధన్యులు

**త్రిపుర:** మనసు నచ్చునెడల మన్నింపఁగా వచ్చు
మనసు నొచ్చు నెడల మా ఁవచ్చు
గాని వివరమేమి కనకుండ వినకుండ
బరుల బ్రువ్వ దిట్ట ఫలము కలదె?

**మధుర:** బ్రాహ్మణత్వం సమాజ వికాసాన్ని సంపూర్ణంగా అరికట్టింది వర్ణాశ్రమ ధర్మాలు ప్రతిష్ఠాపించింది జాతి విభేదాలు రెచ్చగొట్టింది. బానిసత్వ దశను నిలప పాటుబడింది జన్మకారణం గానే పూజలు పొందే హక్కులు కల్పించింది ఇంతేనా మీరు చెప్పదలుచుకున్నది?

**రామస్వామి:** దక్షిణాఫ్రికా యందు నిర్దయులు తెల్ల
వారు భారతీయుల పెట్టు పాట్లు గాంచి
గొల్లుమని యేడ్చునెంతొ గగ్గోలు పడుచు
బనవుచుండును నీ నాటి బ్రాహ్మణుండు

కులాభిమానముతో నందఱి కంటె తానెక్కువయని బ్రాహ్మణుడనుకొనుచున్నట్లే, కొందరి కంటె తానెక్కువయని యీ యభిమానము గలవాడను కొనుచున్నాడు

**మధుర:** సరే-ఐతే నన్నయ ఆదికవి కాడంటారా చౌదరిగారూ?
జోలపాటలు నేర్చి యేలపాటలు చేర్చి
ప్రోడపిల్లయై పాతర లాడనేర్చి
తెలుగు కబ్బపుకన్నియ తెలివితోడ
ఇంతియే కాని నన్నయ వింతగాగ
పుణికి గంటము చేపట్టి కణతలదర ·
కైత పుట్టించె ననుమాట కల్లమాట

**మధుర:** ఇప్పుడు శూద్రవర్గం పైవర్గాల మీదకు విప్లవం చేసి అధికారాన్ని వశం చేసుకుంది. ఇక దళితవర్గం యీా శూద్రవర్గం మీద విప్లవం చేస్తున్నది అధికారాన్ని వశం చేసుకుందుకు.

**రామస్వామి:** (సిగరెట్ బాగా పీలుస్తూ) ఏమున్నది? బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రలందరి మీదా దళితులెక్కి పోతారు. ప్రతిభా గితిభా జాంతానై

**మధుర:** జస్టిస్ పార్టీలో పెద్దలు మీకు కోరుకుంటే జడ్జీ పదవులిచ్చినా మీరు వద్దని పేదరికాన్నే వరించి నిజాయితీతో గడిపారు అని వున్నవ వారన్నారు ఆ విలువలు లేనప్పుడు, మీ వాళ్ళిప్పుడు ఎలా జీవిస్తున్నారో చూస్తే వీళ్ళ కోసమా నేను పోరాడింది అని మీరు ఫీలవుతారు నిరాడంబరులైన మిమ్ముల్ని ఆంధ్రదేశం చాలా అపార్థం చేసుకుంది అందరి కోసం పాటుబడ్డా మీరు కొందరి మనిషే అనుకున్నారు సారీ! చౌదరీగారూ! మన సంస్కృతి నించి మీరు తిరస్కరించిందే ఎక్కువ స్వీకరించింది తక్కువ ★

*('మిసిమి' ఫిబ్రవరి, మార్చి 1992)*